క్లుప్తంగా

వైభవంగా జ్యోతుల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

ఖాజీపేట : మండలంలోని రంగాపురం గ్రామంలో శనివారం చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం అశేష భక్తజన సందోహం నడుమ వైభవంగా సాగింది. తొగటవీర క్షత్రియులు అమ్మవారి జ్యోతులను తలపై పెట్టుకుని నృత్యం చేస్తూ, అమ్మవారిని స్మరిస్తూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. గర్భాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. జ్యోతుల పండుగ పురస్కరించుకుని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సైబర్ నేరాలతో జాగ్రత్త



సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ

రాజుపాళెం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లలో వచ్చే వెబ్‌సైట్ లింక్‌లపై క్లిక్ చేయవద్దని ఎస్‌ఐ కె.వెంకటరమణ సూచించారు. అర్కటవేముల గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రజలకు సైబర్ నేరాలపై, రోడ్డు ప్రమాదాలపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎక్కువ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఏదైనా సైబర్ క్రైం జరిగిన వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నంబర్ 1930 సంప్రదించాలని సూచించారు. రోడ్డు ప్రమాదం జరగకుండా వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి వాహనాలను నడపకూడదన్నారు. ద్విచక్రవాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

ఘనంగా మృత్యుంజయ హోమం



హోమంలో పూర్ణాహుతిని సమర్పిస్తున్న వేద పండితులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామికి విశేష పూజలు చేశారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోక కల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను వేద పండితులు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అబార్షన్లపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేష్

మైదుకూరు : వైద్య ఆరోగ్యశాఖ బద్వేలు డివిజన్ పరిధిలోని ఆస్పత్రిల్లో జరిగిన అబార్షన్లపై శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.మల్లేష్ సమీక్ష నిర్వహించారు. మైదుకూరులోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 పీహెచ్‌సీలు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లకుగాను హాజరైన 19 ఆస్పత్రుల సిబ్బంది అబార్షన్ల వివరాలను వెల్లడించారు. అబార్షన్లకు గల కారణాలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్, ఆడిట్ కమిటీ సభ్యులైన గైనకాలజిస్టులు డాక్టర్ శ్రీలలిత, డాక్టర్ శ్రీలత పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 382 కేసులు పరిష్కారం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 383 కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సేవాధికార సంస్థ, రెండవ అదనపు జిల్లా జడ్జి ఆధ్వర్యంలో మూడు బెంచీలను ఏర్పాటు చేశారు. రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ కె.సత్యకుమారి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నిస్స, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. హారిక 329 క్రిమినల్ కేసులు, 53 సివిల్ కేసులను పరిష్కరించి కక్షిదారులకు రూ.7,09,31,614 చెల్లించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో బద్వేలు కోర్టు న్యాయవాదులు, పోలీసులు సహకరించారు.

ప్రతి మహిళా శక్తిస్వరూపమే

- అన్నిరంగాల్లో రాణిస్తున్న అతివాలోకం
- ఎమ్మెల్యే డాక్టర్ సుధ
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



బద్వేలు అర్బన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ప్రొద్దుటూరు : డీఎస్పీ భావనను సన్మానిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

బద్వేలు అర్బన్ : ప్రతి మహిళా ఓ శక్తిస్వరూపమేనని, మహిళల పట్ల ప్రతిఒక్కరూ గౌరవభావంతో మెలగాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు కూడా ఆడపిల్లల చదువు భారంగా అనుకోకుండా మగవారితో సమానంగా స్వేచ్ఛ కల్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల మహిళా అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల పరిపాలనాధికారి ఆర్.వి. సాయిక్రిష్ణ, బోర్డు మెంబర్ రాచపూడి సుజన, అధ్యాపకులు షాహిన, లక్ష్మీదేవి, రాధ, డాక్టర్ రామసుధ, డాక్టర్ శ్రీలత, సల్మా పాల్గొన్నారు.

మహిళలు లేనిదే మానవ సృష్టి లేదు

ప్రొద్దుటూరు: మహిళలు లేనిదే మానవ సృష్టి లేదని, మహిళలు లేనిది ఒక్క నిమిషం గడవదని, తల్లిగా, చెల్లిగా, భార్యగా అనేక పాత్రలు సమర్థివంతంగా పోషిస్తోందని జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ,, డీఎస్పీ భావన కొనియాడారు. శనివారం స్థానిక పీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో పోలీసు శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సామాజిక, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు మహిళలకు మెమెంటోలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్టేట్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ షేక్ సుమయ, ట్రైనీ డీఎస్పీ భవాని, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, జిల్లా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, కార్యదర్శి శూలం ప్రసాద్, సావిత్రి, నెహ్రూ యువ కేంద్రం సభ్యులు భారతి, రజియా పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడుదాం

స్త్రీ, పురుష సమానత్వం కోసం పోరాడాలని రాయలసీమ మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, కౌన్సిలర్ శివజ్యోతి తెలిపారు. స్థానిక ఆర్ట్స్ కాలేజీ వద్ద రాయలసీమ మహిళా శక్తి ఆధ్వర్యంలో అంతర్జాతీయ గ్రామిక మహిళా దినోత్సవం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి సునీత, రచయిత మహమూద్ పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధి

మహిళలు అన్ని విధాలా అభివృద్ధి చెందితే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు చింతల దానమ్మ తెలిపారు. శనివారం స్థానిక పాతబస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.

అన్ని రంగాల్లో మహిళలదే అగ్రస్థానం

ప్రొద్దుటూరు క్రైం : ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలు అగ్రస్థానంలో నిలుస్తున్నారని ఏపీ ఎన్జీఓ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆర్ జయమ్మ తెలిపారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్జీఓ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సురేఖ, ప్రొద్దుటూరు ఎన్జీఓ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి ఎన్జీఓస్ సహ అధ్యక్షుడు సదాశివ యాదవ్, మధు, శివరామానుజ, నాగరాజు, ప్రభంజన, నాగార్జున, ఉమామహేశ్వరరెడ్డి, చైతన్య మహిళా సంఘం అధ్యక్షురాలు పద్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో, సెర్ప్ సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సాక్స్ మెడికల్ ఆఫీసర్లు సూర్య నాగలక్ష్మి, ఫర్జానా, సిబ్బంది మహేశ్వరి, లీలావతి, శ్రీలేఖలను ఘనంగా సన్మానించారు. చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, ప్రాజెక్టు మేనేజర్ నరేష్‌కుమార్, సెర్ప్ సిబ్బంది ఓబుళమ్మ,భాగ్యలక్ష్మి, ఉమామహేశ్వరి, సునీత, శోభ, పాల్గొన్నారు.

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏపీ హంస జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. రిటైర్డు జిల్లా జడ్జి ఎస్‌ఎం ఇస్మాయిల్, మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, బండి రాజరాత్నం, విజయకుమార్ పాల్గొన్నారు.

కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

స్థానిక ఏడీజే కోర్టులో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నిస్స, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.హారిక ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు.

మహిళా దినోత్సవ వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరరాఘవరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- వాసవి క్లబ్ సిరిపురం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, స్నేహశ్రీ వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ దేవరశెట్టి నాగమణిశయన, వాసవి క్లబ్ సిరిపురం రీజనల్ చైర్మన్ కేతేపల్లి సుష్మలను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ గుండా పద్మనాభయ్య, వేణుగోపాల్, నరసింహారావు, వరలక్ష్మి, నళిని పాల్గొన్నారు.

గోపవరం : మహిళలు అబలలు కాదు సబలలు అని నిరూపించిన తెలుగు రామాయణ తొలి కవయిత్రి మొల్లమాంబ నేటి స్త్రీ జాతికి ఆదర్శమని రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ కొనియాడారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సాహితీపీఠం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సత్తార్ పాల్గొన్నారు.

కాశినాయన : మహిళా సాధికారతతోనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎస్టీయూ రాష్ట్ర సీపీఎస్ కమిటీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షుడు రవీంద్రబాబు అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలను సన్మానించారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

బద్వేలు అర్బన్ : మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు విద్యార్థినీలు, మహిళా పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అర్బన్, రూరల్ సీఐలు ఎం.రాజగోపాల్, ఎం.నాగభూషణ్, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం జి.వి. సుబ్బారెడ్డి, ఎస్‌ఐలు రవికుమార్, శ్రీకాంత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి

పోరుమామిళ్ల: మహిళా సాధికారతతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం ఎస్టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, బి.కోడూరు ఎంపీపీ చెన్నమ్మ, పోరుమామిళ్ల మాజీ ఎంపీపీ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ పుష్పలత, జిల్లా ఎస్టీయూ మహిళా కమిటీ కన్వీనర్ కవిత, విజయజ్యోతి పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో..

స్థానిక బ్లెస్డ్ బ్రెయాన్ అనాథాశ్రమంలో శనివారం మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ఆరోగ్యరాణి, రోజలీనా, డాక్టర్ అమితారెడ్డి, డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

చాపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా వైద్యులు డా.శ్రీవాణి, డా.కావ్య మాధురిని ఫార్మసిస్టు సుభాషిణి, ఏఎన్‌ఎం హేమలత, ఎంఎల్‌హెచ్‌పీ అంజుమన్, ఆశా వర్కర్ మాధవి వైద్యాధికారులు రాజేష్‌కుమార్, ఓబులేసు సన్మానించారు. సీహెచ్‌ఓ మహదేవ్ యాదవ్, పీహెచ్‌ఎస్ సుకన్య, సూపర్‌వైజర్‌లు సరస్వతి, బాబురెడ్డి, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలిస్తున్న చింతల దానమ్మ, మహిళలు



ప్రొద్దుటూరు క్రైం : మహిళా దినోత్సవ వేడుకలకు హాజరైన మహిళా ఉద్యోగులు



డాక్టర్ సూర్య నాగలక్ష్మిని సన్మానిస్తున్న చైతన్య సొసైటీ సభ్యులు



గోపవరం : మొల్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న హనుమంతరావు తదితరులు



కాశినాయన : అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు



పోరుమామిళ్ల: మహిళలను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

మాలలంతా ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భాస్కర్

బద్వేలు అర్బన్ : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలంతా ఐక్యంగా పోరాడాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జె.భాస్కర్, నేషనల్ హ్యూమన్‌రైట్స్ రాష్ట్ర కార్యదర్శి ముత్యాలప్రసాద్, సీనియర్ నాయకుడు కూకట్లపల్లి మురళి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వారి కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం నియోజకవర్గ, ఆయా మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో నియోజకవర్గ అధ్యక్షుడుగా వంకెలసుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శిగా దాసరికృష్ణలను ఎన్నుకున్నారు. అలాగే బద్వేలు రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సుధాకర్, అయ్యవారయ్య, గోపవరం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.వెంకటరమణ, ఎం.వెంకటరమణ, అట్లూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చిన్నగంగయ్య, నారాయణలను ఎన్నుకున్నారు. నారాయణ, సుబ్బరాయుడు, వెంకటయ్య, ఓబయ్య, రామయ్య, తిరుపాలు, మల్లికార్జున పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే



క్రీడా జ్యోతిని అందిస్తున్న డీఎస్పీ భావన, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు కల్చరల్ : చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనని డీఎస్పీ భావన పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య టెక్నో కరిక్యులం స్కూల్‌లో శనివారం డాక్టర్ బీఎస్ రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీక, మానసిక దృఢత్వానికి ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ క్రీడల్లో రాణించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ఏజీఎం నాగిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షాట్‌పుట్, త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల, బద్వేలు, పులివెందుల శ్రీచైతన్య పాఠశాలలకు చెందిన 900 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పరామర్శ



పుత్తా శ్రీరాములును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఇటీవల కంటి సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తా లక్ష్మీదేవి భర్త, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పుత్తా శ్రీరాములును, అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న 2వ వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి భర్త నరసింహులును శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పరామర్శించారు. శస్త్రచికిత్స, అనారోగ్యానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, బూత్ కమిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి యద్దారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవం



పురస్కార గ్రహీతలతో కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య వేదిక ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఎస్‌కే గ్రాండ్‌లో శనివారం కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తవ్వా ఓబుళరెడ్డి, ఈతకోట సుబ్బారావులకు కథా పురస్కారాలు, వశిష్ఠ సోమేపల్లి, జంగం స్వయం ప్రభలకు కవితా పురస్కారాలను, మాచిరాజు కామేశ్వరరావు, డాక్టర్ ఎం.హరికిషన్‌లకు బాలసాహిత్య పురస్కారాలను, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు, రచయితలకు పురస్కారాలు, నగదు, జ్ఞాపికలను అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు, కొనిరెడ్డి పౌండేషన్ వ్యవస్థాపకుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, పద్య కవి ఏసీ దస్తగిరి, ప్రముఖ కవి రాజయ్య రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, కొత్తపల్లి శీను, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ పట్టా అందుకున్న రైతు బిడ్డ



ఎంబీబీఎస్ పట్టా అందుకుంటున్న వరుణేశ్వర్‌రెడ్డి

చాపాడు : ఉన్నత చదువులకు పల్లెలు.. రైతు కుటుంబాలు ఏ మాత్రం అడ్డుకావని మండలంలోని గుంతచీపాడు గ్రామానికి చెందిన ధనిరెడ్డి వెంకట వరుణేశ్వర్‌రెడ్డి చాటి చెప్పాడు. గుంతచీపాడుకు చెందిన రైతు అయిన ధనిరెడ్డి రామలక్ష్మీరెడ్డి, ఉమామహేశ్వరిల కుమారుడు వెంకట వరుణేశ్వర్‌రెడ్డి కర్నూలులోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువు పూర్తి చేశారు. ఈ మేరకూ ఈ నెల 4న జరిగిన కాన్వగేషన్ కార్యక్రమంలో తన తల్లిదండ్రులతో కలసి వరుణేశ్వర్‌రెడ్డి ఎంబీబీఎస్ పట్టా అందుకున్నాడు. పీజీలో కార్డియాలజి, న్యూరాలజీ, జనరల్ వంటి ఏదైనా ఒక విభాగంలో ఉన్నత చదువు పూర్తి చేసి పేద ప్రజలు వైద్యం అందిస్తానని తెలిపాడు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాల్గుణ మాసం రెండవ శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి

మైదుకూరు: తిరుపతి పట్టణంలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాలమహానాడు జిల్లా ప్రెసిడెంట్ ఎన్.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. మైదుకూరు పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం మాలల సింహగర్జనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ జేఏసీ ఉపాధ్యక్షుడు జేవీ రమణ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ మాలలందరూ కలసికట్టుగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. మాల మహానాడు నాయకులు ఐతా బాబు, గోపాల్, కరుణాకర్, ఉప్పలపాటి కుమార్, పసల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి విరాళం అందజేత



విరాళం అందజేస్తున్న సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్యమఠం ఆవరణలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు ప్రముఖ పారిశ్రామికవేత్త సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి శనివారం రూ.1,11,116లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తల్లిదండ్రులైన దివంగత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి, నాగఓబులమ్మల జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ విరాళాన్ని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డివెంకటరామిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో రాధాకృష్ణారెడ్డికి ప్రత్యేక పూజలు చేయించి శాలువాతో సత్కరించారు.

రాజీ మార్గమే ఉత్తమం



లోక్ అదాలత్‌లో రాజీ అయిన వారికి అవార్డు ఫారం అందజేస్తున్న న్యాయమూర్తులు

బద్వేలు అర్బన్ : కక్షిదారులు పంతానికి పోకుండా రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గమని, ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, కడప మూడవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృధా చేసుకోకుండా కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ సందర్భంగా రెండు బెంచిలను ఏర్పాటు చేసి 269 క్రిమినల్ కేసులు, 14 సివిల్ కేసులు మొత్తం 283 కేసులు పరిష్కరించి రూ.53.57 లక్షలు బాధితులకు అందజేసినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయండి

పోరుమామిళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామాల సర్వే కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి సూచించారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో 9 మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఒక రోజు శిక్షణా తరగతిలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని నాన్ అగ్రికల్చర్ స్థలాలు, భవనాలు, ఇతర ఆస్తులను సర్వే చేసి వాటికి ఒక ప్రత్యేక సంఖ్యతో నమోదు చేయాలన్నారు. సర్వే చేసిన తర్వాత హక్కుదారులకు వారి ఆస్తికి సంబంధించి కొలతలతో కూడిన ప్రాపర్టీని పార్శిల్ మ్యాప్‌ను అందిస్తామని పేర్కొన్నారు. జియోగ్రాఫికల్ సాంకేతికత, రోవర్, డ్రోన్ స్వామిత్వలో వినియోగించడంపై ప్రాక్టికల్‌గా వివరించారు.

భవిష్యత్తును నిర్ణయించేది చదువే

ప్రొద్దుటూరు కల్చరల్ : క్రమశిక్షణతో కూడిన ఉన్నత చదువులు విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తాయని గీతాంజలి హైస్కూల్ చైర్‌పర్సన్ శ్రేయారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో శనివారం పాఠశాల 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా చదువు, వివిధ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. పాఠశాల వ్యవస్థాపకుడు శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు